సాక్షి
జోగులాంబ గద్వాల
శుక్రవారం । 24 । జనవరి । 2025



రాష్ట్రంలో దుష్ట పాలన
రాష్ట్రంలో కాంగ్రెస్ దుష్టపాలన సాగిస్తోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు IIలో ▸



గంజాయి దహనం
జిల్లావ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో పట్టుబడిన గంజాయిని పోలీసులు దహనం చేశారు.

వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం
35.8 /14.9

వాతావరణం
చల్లని గాలులు వీయడంతోపాటు మంచు కురుస్తుంది. రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది. ఎండ ప్రభావం చూపిస్తుంది.

న్యూస్‌రీల్

25న పట్టుబడిన వాహనాల వేలం
గద్వాల క్రైం: జిల్లా ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో పట్టుబడిన 19 ద్విచక్ర వాహనాలకు ఈ నెల 25వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు దరావత్ రూ.5వేలు చెల్లించి జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ఆవరణ నిర్వహించే వేలం పాటలో పాల్గొనవచ్చని, వేలంలో వాహనాలు దక్కించుకోని వారికి దరావత్ డబ్బు తిరిగి ఇవ్వనున్నట్లు తెలిపారు.

30న గుర్తింపు లేని వాహనాలు..
వివిధ కేసుల్లో పట్టుబడిన గుర్తింపు లేని(స్క్రాప్) వాహనాలకు ఈ నెల 30వ తేదిన జిల్లా సాయుధ కార్యాలయ ఆవరణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వ్యాపారులు ఎంట్రీ ఫీజు రూ. 200, ఆధార్ కార్డులను జిల్లా పోలీసు కార్యాలయంలో సమర్పించి పాల్గొనాలని తెలిపారు. మొత్తం 73 స్క్రాప్ ద్విచక్రవాహనాలు ఉన్నాయని, వేలంలో పాల్గొనే వారికి ఈ నెల 29వ తేదీన స్క్రాప్ వాహనాలను చూసుకునేందుకు వెసులు బాటు కల్పించామని, వివరాల కోసం సెల్ నం.8712670280, 8712670281కు సంప్రదించాలని తెలిపారు.

26న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు
గద్వాలటౌన్ : ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ టోర్నమెంట్‌కు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డీకే స్నిగ్ధారెడ్డి, కార్యదర్శి నర్సింహ తెలిపారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక ఇండోర్ స్టేడియంలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. 85 కేజీలలోపు బరువు ఉన్న కేటగిరిలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ నంబర్లు : 8919216300, 9951103371 సంప్రదించాలన్నారు.

ఆర్టిజన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



గద్వాలటౌన్: డిమాండ్ల సాధన కోసం విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల జేఏసీ నాయకులు ఎస్ఈ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి నాల్గో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు వేరువేరుగా సంఘీభావం ప్రకటించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ చంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కుర్వ పల్లయ్య కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఆర్టిజన్లు ఏళ్ల తరబడి సంస్థలో సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా, కంప్యూటర్ ఆపరేటర్‌గా వెట్టిచాకిరి చేస్తున్నారని ఆందోళన వ్య క్తం చేశారు. ఆరేళ్ల క్రితం ఆర్టిజన్లను సంస్థలో విలీ నం చేసినా పూర్తిస్థాయి ఉద్యోగ హక్కులు కల్పించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అర్హతను బట్టి వివిధ పోస్టుల్లో ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాల ని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కంచకుంటే ఆర్టిజన్లు చేపట్టే ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పరుమాలరాజు, రామకృష్ణ, అనంతరెడ్డి, సతీష్, రాముడు, సురేష్, నాగన్న, తి రుమల్, రాజనర్సింహులు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి
గద్వాల క్రైం: రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాల్సిందిగా జిల్లా ఇంచార్జ్ వైద్యాధికారి సిద్దప్ప అన్నారు. గురువారం సాయంత్రం జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని నూతనంగా ఎన్సీడీ విభాగాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని షుగర్, బీపీ, క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల కోసం ఈ ఎన్సీడీ విభాగం పనిచేస్తుందని, 30 సంవత్సరాలు పై బడిన ప్రతి ఒక్కరు తమ ఆరోగ్య సమస్యలను తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.5,906
గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు గురువారం 1328 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.5906, కనిష్టం రూ.3569, సరాసరి రూ.4910 ధరలు పలికాయి. అలాగే, 10 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం రూ.5559, కనిష్టం రూ.5449, సరాసరి రూ.5519 ధర లభించాయి. దీంతోపాటు 158 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ.7119, కనిష్టం రూ.2229, సరాసరి రూ.7119 ధరలు వచ్చాయి. 16 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం, కనిష్టం, సరాసరి రూ. 2306 ధర లభించింది.

‘పాలమూరు’.. డిండీ!

- ఉమ్మడి మహబూబ్‌నగర్ **జిల్లా వాసుల్లో** పెల్లుబికుతున్న వ్యతిరేకత
- జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర **ప్రజాప్రతినిధులు** మౌనం వహించడంపై **కలవరం**
- పోరుబాట సన్నాహాల్లో **పాలమూరు** అధ్యయన వేదిక

హాట్‌టాపిక్‌గా ఏదుల నుంచి డిండికి నీటి మళ్లింపు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: **పాలమూరు–రంగారెడ్డి** ఎత్తిపోతల పథకం నుం**చి డిండికి నీటిని తర**లించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణ**యం ఉమ్మడి మహ**బూబ్‌నగర్ జిల్లాలో కలకలం **రేపుతోంది. పాల**మూరుకు చెందిన రేవంత్‌రె**డ్డి ముఖ్యమంత్రిగా** ఉన్నా మంత్రివర్గ ఆమోద ము**ద్రపడడం.. తాజాగా** పరిపాలన అనుమతులు మ**ంజూరు చేయడం..** దీనిపై ఉమ్మడి జిల్లాకు చెందిన **ఎమ్మెల్యేలు మౌనం** వహిస్తుండడం జిల్లావాసులను **కలవరపెడుతోంది.** ఈ నేపథ్యంలో ఉమ్మడి పా**లమూరులోని ఐదు** జిల్లాలకు చెందిన ప్రజాప్ర**తినిధులు, రాజకీయ** నేతలు ఇప్పటికైనా మౌనం వీడాలని బహిరంగలేఖలతో ఇదివరకే పోరు ప్రారంభించిన పాలమూరు అధ్యయన వేదిక.. ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేసే దిశగా పావులు కదుపుతుండడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

గత ప్రభుత్వంలో వెనుకడుగు..
పీఆర్ఎల్ఐలో భాగంగా వనపర్తి జిల్లాలో నిర్మిస్తున్న ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీళ్లను తరలించేందుకు ప్రతిపాదించిన ఏదుల–ఉల్పర లింక్ పనుల కోసం రూ.1,800 కోట్లతో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా బుధవారం పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఏదుల నుంచి 2.52 కిలోమీటర్ల మేర ఓపెన్ కాల్వతో పాటు 16 కి.మీ.ల సొరంగం.. ఆ తర్వాత మరో 3.05 కి.మీ.ల కాల్వను నిర్మించి దుందుభీ నదిలోకి నీళ్లు పోస్తారు. అక్కడ నీటిని మళ్లించేందుకు పోతిరెడ్డిపల్లి వద్ద రబ్బర్ డ్యామ్ నిర్మించనున్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి ఏదులకు రోజుకు రెండు టీఎంసీల చొప్పున ఎత్తిపోసి.. ఇందులో రోజుకు అర టీఎంసీ చొప్పున 60 రోజులకు 30 టీఎంసీల నీటిని డిండి ఎత్తిపోతలకు మళ్లించనున్నారు. అయితే పాలమూరు నుంచి డిండి పేరున నీటి మళ్లింపు ప్రతిపాదన గతంలోనే ముందుకు రాగా.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, సాగునీటి రంగ నిపుణులు, రైతులు వ్యతిరేకించారు. పెద్ద ఎత్తున వ్యతిరేకత పెల్లుబికడంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వెనుకడుగు వేసింది.

అప్పుడు వ్యతిరేకించిన కాంగ్రెస్ నేతలే..
బీఆర్ఎస్ హయాంలో **పాలమూరు**–డిండి నీటి మళ్లిం**పు ప్రతిపాద**నలు తెరపైకి **వచ్చినప్పుడు** పాలమూరు **అధ్యయన** వేదిక.. ప్రజాసం**ఘాలు, ప్రతిప**క్ష పార్టీలతో కలిసి **ఉద్యమించింది.** అప్పుడు **ప్రధాన ప్రతిప**క్షంగా ఉన్న కాం**గ్రెస్ పార్టీ నా**యకులు సైతం ఇం**దుకు మద్దతు**గా ఆందోళనలో **పాల్గొన్నారు.** ప్రజా వ్యతిరేకత **నేపథ్యంలో** అప్పటి ప్రభుత్వం **పాలమూరు**–డిండి నీటి మళ్లిం**పుపై ముంద**డుగు వేయలేదు. **ప్రస్తుతం కాం**గ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉండి.. పాలమూరు నుంచి డిండికి నీరు మళ్లించేందుకు శ్రీకారం చుట్టడంపై ప్రజల్లో చర్చ జోరుగా సాగుతోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాకు అన్యాయం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశామని చెబుతున్న ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు స్తబ్దుగా ఉండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లా ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెంచేలా..
రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఏదుల నుంచి డిండికి నీటిని మళ్లించే పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయడంతో పాలమూరు అధ్యయన వేదిక ఆందోళన బాటకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏదుల నుంచి డిండికి నీటి తరలింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలపై ఒత్తిడి పెంచే విధంగా ప్రజా సంఘాలతో కలిసి నిరసనలు చేపట్టేందుకు సన్నద్ధమవుతోంది. ఈ మేరకు జిల్లాల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. ■

పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం..



పాలమూరు నుంచి డిండికి నీటి తరలింపు నిర్ణయం ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు నష్టం చేస్తుంది. ఇప్పటికే శ్రీశైలం, కల్వకుర్తి, పాలమూరు–రంగారెడ్డి పథకాల్లో ఎంతో మంది రైతులు భూములు కోల్పోయారు. ఏదుల–డిండి మళ్లీ ఆ రైతులను ముంచుతుంది. వెనుకబడ్డ మహబూబ్‌నగర్‌తో పాటు రంగారెడ్డి జిల్లాల సాగునీటి హక్కును హరిస్తుంది. రైతుల మధ్య వైరానికి దారితీస్తుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆ ప్రతిపాదన ముందుకు పడకుండా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి చొరవ తీసుకున్నాడు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న ఆయన మళ్లీ చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ డిండికి పాలమూరు నీటి తరలింపును ఒప్పుకోం.

– రాఘవాచారి, పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్

ఉపసంహరించుకోవాలి..



డిండి ఎత్తిపోతల పథకానికి అదే నల్లగొండ జిల్లాలోని ఎలిమినేటి మాధవరెడ్డి, ఎస్ఎల్‌బీసీ, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌ల నుంచి నీటిని తీసుకోవచ్చు. ఏదుల నుంచి నీటిని తరలించాలనుకోవడం వెనుకబడిన పాలమూరును నట్టేట ముంచడమే. దీన్ని వ్యతిరేకిస్తూ గతంలో వారించాం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అని చెప్పుకుంటున్న సీఎం రేవంత్రెడ్డి జిల్లాకే అన్యాయం చేస్తున్నాడు. ఏదుల–డిండి నీటి మళ్లింపు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. లేకుంటే ఊరుకునేదే లేదు.

– డీకే అరుణ, ఎంపీ, మహబూబ్‌నగర్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



వీరాపురంలో గ్రామసభకు హాజరైన ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని, ఆందోళన చెందకుండా దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం గద్వాల మండలంలోని వీరాపురంలోని గ్రామసభకు ఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామస్తులు సంబంధిత అధికారులకు సహకరించి గ్రామసభలను సజావుగా నిర్వహించుకోవాలని, గ్రామంలో ఎవరైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే మా దృష్టికి తీసుకురావాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

అధికారులను నిలదీసిన ప్రజలు
ఎర్రవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన గ్రామసభల్లో అర్హులను కాకుండా అనర్హులను సంక్షేమ పథకాలకు ఎంపిక చేయడంపై ప్రజల నుంచి నిరసన వ్యక్తమైంది. గురువారం మండలంలోని జింకలపల్లి, ఎర్రవల్లి, షేకుపల్లి, ధర్మవరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల నుంచి వివిధ పథకాల కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ప్రాథమిక జాబితాలో వివిధ పథకాల కోసం నిజమైన అర్హులను గుర్తించలేదని ఆయా గ్రామాల్లో ప్రజలు అధికారులను నిలదీయగా వారు సరైన సమాధానాలు చెప్పలేకపోయారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ మొహియుద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణ, ఆర్ఐలు శంశేర్, శ్రీనివాసులు, కార్యదర్శులు, టిఏలు, ఏఈఓలు పాల్గొన్నారు.

న్యాక్ బృందం పరిశీలన



పీయూ తెలుగు డిపార్ట్‌మెంట్‌లో న్యాక్ కమిటీ సభ్యులకు తెలంగాణ సంస్కృతిని వివరించిన విద్యార్థులు

- ఆరుగురు సభ్యుల బృందానికి సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికిన అధికారులు
- వీసీ ప్రజెంటేషన్ నుంచి ప్రారంభమైన పరిశీలన
- పీయూ పీజీ కళాశాలలోని 18 డిపార్ట్‌మెంట్లలో మూడు బృందాలు
- రేపు పీజీ సెంటర్లను సందర్శించే అవకాశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి వచ్చిన న్యాక్ పీర్ కమిటీ పీయూలో గురువారం విస్తృత తనిఖీలు చేపట్టింది. ఉదయం 10.30 గంటలకు ఆరుగురు సభ్యుల కమిటీ చేరుకున్నారు. ఇందులో చైర్‌పర్సన్‌గా ప్రొఫెసర్ రామశంకర్ దుబే కాగా.. సభ్యులు కేకే అగర్వాల్, అన్నస్వామి నారాయణమూర్తి, జయశ్రీ నాయర్, అశుతోష్‌కుమార్, మాల్యా కె దాస్ ఉన్నారు. ముందుగా వీరికి పీయూ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేషన్ భవనం నుంచి వీసీ చాంబర్ వరకు పూర్ణకుంభం, తెలంగాణ బోనం, కోలాటాల మధ్య సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. అక్కడ కొద్దిసేపు అడ్మినిస్ట్రేషన్ అధికారులు వీసీ చాంబర్‌లో చర్చలు జరిపారు. వారు అడిగిన ప్రశ్నలకు పీయూ వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప, ఐక్యూఏసీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ సమాధానాలు ఇచ్చారు. శుక్రవారం కొల్లాపూర్, వనపర్తి, గద్వాల పీజీ సెంటర్లలో కమిటీ సభ్యులు తనిఖీలు చేస్తారని, శనివారం పీయూలోని హాస్టళ్లు, స్పోర్ట్స్, ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లను పరిశీలిస్తారని సమాచారం.

18 డిపార్ట్‌మెంట్లు..
ఉదయం 11 గంటలకు వీసీ సమావేశ మందిరంలో ఆరుగురు కమిటీ సభ్యులకు వీసీ శ్రీనివాస్ ప్రొజెక్టర్ ద్వారా పీయూకు సంబంధించి ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. పీయూలో ఎన్ని కళాశాలలు ఉన్నాయి.. అడ్మినిస్ట్రేషన్ భవనాలు, గ్రౌండ్‌లు, ఎన్ని డిపార్ట్‌మెంట్‌లు ఉన్నాయి.. ఎంత మంది టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ ఉన్నారు. అనే అంశాలపై పూర్తి సమాచారాన్ని కమిటీ సభ్యులకు వివరించారు. అక్కడి నుంచి నేరుగా బృందం సభ్యులు పీయూ పీజీ కళాశాలకు చేరుకుని మొత్తం 18 డిపార్ట్‌మెంట్లలో విస్తృతమైన తనిఖీలు జరిపారు. ఇందులో డిపార్ట్‌మెంట్ విద్యార్థులు, స్టాఫ్ వివరాలు కరిక్యులర్ యాక్టివిటీస్, రీసెర్చి తదితర అంశాలపై డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీలతో సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇందుకు అన్ని డిపార్ట్‌మెంట్ల నుంచి పూర్తిస్థాయి సమాచారం వచ్చిందని కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ఆయిల్‌పాం సాగుతో అధిక ఆదాయం

ఆయిల్‌ఫెడ్ ఎండీ షేక్ యాస్మిన్‌బాషా



ఆయిల్‌పామ్ నర్సరీని పరిశీలిస్తున్న ఆయిల్ ఫెడ్ ఎండీ షేక్ యాస్మిన్‌బాషా

ఎర్రవల్లి: రైతులు ఆయిల్‌పామ్ సాగుచేసి అధిక ఆదాయం పొందవచ్చని ఆయిల్‌ఫెడ్ ఎండీ షేక్ యాస్మిన్‌బాషా కోరారు. గురువారం ఎర్రవల్లి మండలం బీచుపల్లి ఆయిల్‌పామ్ మిల్లును ఆమె సందర్శించి నర్సరీ, తోట, మిల్లును పరిశీలించారు. ఆయిల్‌ఫెడ్, ఉద్యాన అధికారులతో సాగు విస్తీర్ణం, ఉద్యాన పథకాలపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. బీచుపల్లి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో ప్రత్యేక వేదికను ఏర్పాటుచేసి సాగుపై రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. తోట చుట్టూ శ్రీ గంధం మొక్కలు నాటించేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయిల్ పామ్ సాగు చేసిన పలువురు రైతులతో మాట్లాడి పంట సాగు, ప్రభుత్వం నుంచి అందుతున్న రాయితీల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి అక్బర్, ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేష్, ఉద్యాన అధికారులు రాజశేఖర్, మహేష్, ఇమ్రాన్, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

26న ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపికలు
మహబూబ్‌నగర్ క్రీడలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–14 విభాగాల సాఫ్ట్‌బాల్ బాలబాలికల ఎంపికలను ఈనెల 26వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పాఠశాల బోనఫైడ్, ఒరిజనల్ ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఎంపికలకు హాజరుకావాలని కోరారు. మిగతా వివరాల కోసం పీడీ నాగరాజు (9959220075) నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం
కల్వకుర్తి టౌన్: పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లుగా ప్రిన్సిపాల్ కిరణ్మయి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో పీజీటీ బయోసైన్స్, టీజీటీ సైన్స్ సబ్జెక్టులలో 50 శాతం మార్కులతో బీఈడీ ఉత్తీర్ణులై, టెట్ రాసిన మహిళా అభ్యర్థులు ఈ నెల 30లోగా పాఠశాలలో నేరుగా వచ్చి దరఖాస్తులు అందించాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 73311 70833, 96669 59372లను సంప్రదించాలని ఆమె సూచించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



జిల్లా మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ బీఎం. సంతోష్ అన్నారు. గురువారం పట్టణంలోని దౌదర్‌పల్లి సమీపంలో రూ.5కోట్లతో నిర్మించనున్న జిల్లా మహిళాసమాఖ్య నూతన భవనానికి ఆయన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేసి, భూమిపూజ పనులు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు బ్యాంకులు అందిస్తున్న రుణాలతో వివిధ వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఏకరూప దుస్తులు కుట్టించే అవకాశం మహిళా సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిందని చెప్పారు. ప్రభుత్వం పలు ప్రభుత్వ కార్యక్రమాలను మహిళా సంఘాల ద్వార ప్రజల్లోకి తీసుకెళ్తోందని అన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి..
ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళలు కూడా పురుషులతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులు కుటీర పరిశ్రమలు, వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకు సైతం ముందుకు రావాలని చెప్పారు. నూతన మహిళా సమాఖ్య భవనం త్వరగా నిర్మాణం పూర్తి అయ్యేలా పనులు చేపట్లాలన్నారు. ఇంచార్జి అడిషనల్ కలెక్టర్ నర్సింగరావ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కింద బ్యాంకులు, స్త్రీనిధి ద్వార రుణాలు అందిస్తూ వ్యాపార నిర్వహణ అవకాశాలు, బీమా పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కురువ హనుమంతు, మాజీ జడ్పీచైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, చెన్నయ్య, రమేష్‌నాయుడు, కౌన్సిలర్లు దౌలు, శ్రీనివాసులు, నరహరిగౌడ్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సంగీత పాల్గొన్నారు.

నేతాజీ జీవితం అందరికీ ఆదర్శం



గద్వాలలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గద్వాలటౌన్/అలంపూర్: జాతిపిత మహాత్మాగాంధీని మొట్ట మొదటిసారి ఫాదర్ ఆఫ్ నేషన్ అని పిలిచింది సుభాష్ చంద్రబోస్ అని, ఆజాద్ హింద్ ఫౌజ్ పేరుతో ఒక సైనిక దళాన్ని ఏర్పాటుచేసి స్వాతంత్రం కోసం పోరాటం చేసిన వీరుడని, ఆయన జీవితం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే విజయుడు, గురుకులాల మాజీ కార్యదర్శి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. అలంపూర్‌లో నేతాజీ సుభాష్ జయంతి ఉత్సవాలను నేతాజీ ఫ్రెండ్స్ చైతన్య సేవా సమితి అధ్యక్షుడు వెంకట్రామయ్యశెట్టి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించగా వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. చిన్నతనం అనేది ఎంతో అమూల్యమైనదని విద్యార్థులు తమ జీవితాన్ని ఆగం చేసుకోకుండా నిరంతరం చదువుకొని గొప్ప వ్యక్తులు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉన్నత చదువులతోపాటు మహనీయుల చరిత్రలు తెలుసుకోవాలన్నారు. వికాస భారతి సాహితీ సంస్కృతి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కవి సమ్మేళనం నిర్వహించారు. కవులు, కళాకారులు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులకు సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.కార్యక్రమంలో మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..
జిల్లా కేంద్రంలో నేతాజి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక రాజీవ్ మార్గ్ రోడ్డులోని నేతాజి విగ్రహానికి వివిధ సంఘాల నాయకులు, విద్యార్థులు వేరువేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు ర్యాలీగా వచ్చి నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో నేతాజి పాత్ర ఎంతో కీలకమైందని చెప్పారు. నేతాజీ ఆశయాలు, ఆలోచనలు నేటి సమాజానికి స్ఫూర్తి దాయకం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయశ్రీ, బండల వెంకట్రాములు, దేవాదాసు, చిత్తారి కిరణ్, నర్సింహా, కృష్ణ, వాసు, మోహన్‌రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నేతాజీ జయంతి నిర్వహించి వీరమరణం పొందిన జవానులకు నివాళులర్పించారు. నాయకులు నరేష్ పటేల్, మురళి, శాంతిరాజ్, సురేష్, నవీన్, ఆగస్టీన్ తదితరులు పాల్గొన్నారు. వీహెచ్‌పీ నాయకులు నేతాజీ జయంతి వేడకలను ఘనంగా నిర్వహించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


అమృనాయక్ (ఫైల్)

పెద్దకొత్తపల్లి: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందిన ఘటన మండలంలోని వేడుకరావుపల్లితండాలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. తండాకు చెందిన పాత్లావత్ అమృనాయక్ (52) తన వ్యవసాయ పొలంలో వరినాట్లు వేస్తుండటంతో ఉదయం పొలానికి వెళ్లాడు. అక్కడే తెగిపడిన విద్యుత్ తీగ కాలుకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య మంగమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మేకల గౌరమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యులు దండు నర్సింహ, సత్యం, చిన్నయ్య, మైసమ్మ, చైర్మన్ శ్రీనివాసులు, రాంలాల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


తిరుపతిరెడ్డి (ఫైల్)

మరికల్: అనారోగ్యంతో బాధపడుతూ మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జిన్నారంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని జిన్నారం గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి(45) మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు ఎన్నో అవస్థలు పడి మద్యం మాన్పించారు. ఈ క్రమంలో తిరుపతిరెడ్డి మతిస్థిమితం కోల్పోయి అనారోగ్యానికి గురయ్యాడు. ఇటీవల గుండెకు బైపాస్ సర్జరీ చేయించారు. మతిస్థిమితం కోల్పోయి అతను బుధవారం అర్ధరాత్రి రైతు వేదిక సమీపంలో రోడ్డు పక్కన వేప చెట్టుకు లుంగీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి 1గంట సమయంలో కాలకృత్యాలకు బయటికొచ్చిన వారు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసి భయాందోళనకు గురయ్యారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు. తిరుపతిరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


తిరుపతయ్య (ఫైల్)

భూత్పూర్: మండలంలోని కొత్తమొల్గరకి చెందిన లింగాల తిరుపతయ్య(45) గురువారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. వివరాలు.. బుధవారం రాత్రి కొత్త మొల్గరలో రోడ్డు దాటుతుండగా మంగనూరు నుంచి భూత్పూర్ వైపు వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొట్టింది. దీంతో తిరుపతయ్యకు తీవ్రగాయాలు కాగా 108లో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య శాంతమ్మ, ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. మృతుడి తల్లి లింగాల నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడు బలవన్మరణం

ఆత్మకూర్: కడుపునొప్పి భరించలేక యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ వివరాల ప్రకారం.. ఆత్మకూర్ పట్టణంలోని బీసీ కాలనీలో నివాసముంటున్న సాయిలు (22) ఆటోలో ఫిల్టర్‌వాటర్ సప్‌లై చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సోదరుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భర్తను హతమార్చిన భార్య



కల్వకుర్తి టౌన్: క్షణికావేశంలో భార్య ఇంట్లో ఉన్న రోకలిబండతో భర్త తలపై మోదడంతో మృతిచెందిన ఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి కథనం మేరకు.. పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీలో లక్ష్మణ్ (43), అతడి భార్య మస్తానమ్మ, ఇద్దరి పిల్లలతో కలిసి ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగించేవారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో భార్యాభర్తలు గొడవ పడ్డారు. అది పెద్దగా అవడంతో క్షణికావేశంలో భార్య ఇంట్లో ఉన్న రోకలిబండతో లక్ష్మణ్ తలపై మోదింది. రక్తస్రావం కావడంతో వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించాడు. మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో మృతదేహాన్ని సీఐ నాగార్జున పరిశీలించి మృతికిగల కారణాలు బంధువులను అడిగి తెలుసుకున్నారు. లక్ష్మణ్ తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

రూ.83 లక్షల విలువ చేసే గంజాయి దహనం


దహనం చేయడానిక సిద్ధం చేసిన గంజాయి, అల్ఫ్రాజోలం పరిశీలిస్తున్న డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులు

- మత్తు పదార్థాలను సాగు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు: ఎస్పీ డి.జానకి

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లావ్యాప్తంగా ఏడాది కాలంలో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిందితుల నుంచి సీజ్ చేసిన ప్రభుత్వ నిషేధిత గంజాయిని గురువారం జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఎస్పీ డి.జానకి, కమిటీ సభ్యులు ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దహనం చేశారు. ఐదు కేసుల్లో రూ.83,12,250 విలువ చేసే 183.490 కిలోల ఎండు గంజాయి, 3.725 కిలోల అల్ఫ్రాజోలంను ఎన్‌డీపీఎస్ చట్ట ప్రకారం జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తూ ఖిల్లా ఘనపురం మండలం షాపూర్ గ్రామ శివారులో ఉన్న ఓ ప్రైవేట్ కంపెనీలోని మిషన్‌లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లోని నిబంధనల ప్రకారం జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో సీజ్ చేసిన గంజాయి, అల్ఫ్రాజోలం దహనం చేసినట్లు వెల్లడించారు. కొందరు అక్రమార్జనలో భాగంగా గంజాయి సాగు, విక్రయాలు, అల్ఫ్రాజోలం విక్రయాలు చేస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి దించుతున్నారని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిని అరికట్టడం కోసం జిల్లా వ్యాప్తంగా పోలీసుల ద్వారా విస్తృత తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి సాగు చేసినా, విక్రయించినా, ఇతర మత్తు పదార్థాలను సాగు చేసినా, రవాణా చేసినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, సీఐలు అప్పయ్య, గాంధీనాయక్, రామకృష్ణ, ఎస్‌ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సకల జనుల సమ్మె కేసు మాఫీ చేయాలి

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో 2011లో సకలజనుల సమ్మె సమయంలో ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులపై నమోదు చేసిన కేసును మాఫీ చేయాలని కోరుతూ గురువారం ఉద్యమకారులు ఎస్పీ డి.జానకిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీజేఏసీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రసాధన కోసం జరిగిన ఉద్యమంలో నమోదు అయిన పోలీస్ కేసులు అన్నింటిని మాఫీ అయ్యాయని, టూటౌన్‌లో నమోదు అయిన ఈ ఒక్క కేసులో 27 మంది ఉందని తెలిపారు. ఈ కేసులో అనారోగ్యంతో బాధపడే వారితో పాటు నడవలేని స్థితిలో ఉన్న వారని ఈ కేసును వారందరికి విముక్తి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రనాయక్, చంద్రకాంత్‌రెడ్డి, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యులు

రాజాపూర్(బాలానగర్): మైనర్లకు వాహనాలు ఇచ్చి వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడకూడదని ఎస్పీ జానకి సూచించారు. బాలానగర్ మండలంలోని నందారంలో ఆమె మాట్లాడారు. తాగి వాహనాలు నడపొద్దని, నియమ నిబంధనలు పాటించాలన్నారు. అతివేగంతో పాటు రాంగ్‌రూట్‌లో వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం సైబర్ నేరాలను వివరిస్తూ.. సెల్‌ఫోన్‌లలో వచ్చే ప్రకటనలకు పోవద్దని సూచించారు. జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, ఎస్‌ఐ తిరుపాజి, మాజీ సర్పంచ్ హీర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాల్మొక్త.. పింఛన్ ఇప్పించండి


గ్రామసభలో అధికారి కాళ్లు పట్టుకుంటున్న వృద్ధుడు

'పింఛన్ మంజూరు చేయాలని ఏళ్లతరబడిగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. పైగా.. అధికారులతో నిరంతరం పనులు చేయించే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనకు రూ.20 వేలు ఇస్తే పింఛన్ మంజూరు చేయిస్తానని చెబుతున్నారు. నా వద్ద అంత డబ్బు లేదు.. నాకు ఇప్పటికే 65 ఏళ్లు వచ్చాయి. కాల్మొక్త.. మీరైనా పింఛన్ మంజూరు చేయండి అని మండలంలోని హిందుపూర్ గ్రామసభలో గురువారం గ్రామానికి చెందిన వాకిటి శంకరప్ప ఎంపీఓ విజయలక్ష్మి కాళ్లు పట్టుకొని వేడుకున్నాడు. అకస్మాత్తుగా ఆయన కాళ్లు పట్టుకోవడంతో సదరు అధికారి నచ్చచెప్పకుండా కసురుకోవడం గమనార్హం. ఆ తర్వాత కాళ్లపట్టుకోవద్దు నీ సమస్య తర్వాత పరిష్కరిస్తామని చెప్పారు. అంతకు ముందు తహసీల్దార్ వెంకటేష్ మాట్లాడుతుండగా రైతులు అడ్డుకోవడంతో తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు మేం చెప్పేది వినండి.. ఆ తర్వాత మీరు చెప్పేది మేం వింటాం.. అలా కాకుండా మీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే సభ రద్దు చేసి వెళ్లిపోతామన్నారు. అలాగే అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓ పోలీస్ అధికారి సైతం గ్రామస్తుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. – కృష్ణా

'సాక్షి' స్పెల్‌బీలో మెరిసిన మౌంట్‌బాసిల్ విద్యార్థి



విద్యార్థిని సన్మానిస్తున్న పాఠశాల డైరెక్టర్ శిరీష, ప్రిన్సిపాల్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయిలో చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లిష్‌పై మక్కువ పెంచేలా 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గత నెల వివిధ స్థాయిల్లో నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో జిల్లా నుంచి వేల సంఖ్యలో విద్యార్థులు పాల్గొని పరీక్ష రాశారు. ఈ మేరకు రాష్ట్రస్థాయిలో జరిగిన స్పెల్ బీ పరీక్షకు జిల్లాకేంద్రంలోని మౌంట్‌బాసిల్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని దిబ్యాను సత్తాచాటారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవినారాయణ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినికి కాంస్య పతకం, నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థిని ఆమె తల్లిదండ్రులను శాలువాతో సన్మానించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ శిరీష మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సబ్జెక్టు విషయాలతోపాటు పోటీ పరీక్షల్లో సత్తా చాటే విధంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చంద్రకళా వెంకటయ్య, డైరెక్టర్స్ పూజితా మోహన్‌రెడ్డి, శిరీష ప్రవీణ్, సుశాంత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ దుష్ట పాలన


అలంపూర్‌లో కళాజాతా బృందంతో కలిసి డప్పు వాయిస్తున్న ఎమ్మెల్యే విజయుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

అలంపూర్ : రాష్ట్రంలో కాంగ్రెస్ దుష్టపాలన చేస్తోందని గురుకులాల మాజీ కార్యదర్శి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని హరిత హోటల్‌లో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్, ప్రియాంక, మల్లికార్జున ఖర్గేను తీసుకొచ్చి కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభల పేరుతో ప్రజలను మరోసారి మోసం చేస్తుందని అన్నారు. గ్రామసభలు ఎందుకు నిర్వహిస్తున్నారో తెలియని అయోమపరిస్థితి నెలకొందన్నారు. ప్రజలు ఓడించిన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కాంగ్రెస్ నాయకులు చెప్పినవారికే పథకాలు ఇవ్వాలని ఏహోదాతో అధికారులకు ఆదేశిస్తున్నారని ప్రశ్నించారు. గద్వాల్‌లో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలను లబ్ధిదారులుగా గుర్తించాలని అధికారులకు ఆదేశించడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ హాయంలో పట్టణ ప్రగతి పేరుతో మున్సిపాలిటిలకు, పల్లెప్రగతి పేరుతో గ్రామాలకు నిధులు వచ్చాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో భూదందా నడుస్తోందని, సీఎం తమ్ముడే ఈదందాను నడిపిస్తున్నాడని ఘాటుగా విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు వెయ్యి గొంతుకలు'కు సంఘీభావం

ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ సాధనకు నిర్వహిస్తున్న లక్ష డప్పులు వెయ్యి గొంతుకులకు ఎమ్మెల్యే విజయుడు, గురుకులాల మాజీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ సంఘీభావం తెలిపారు. అలంపూర్ పట్టణంలో లక్ష డప్పులు, వెయ్యిగొంతుకలకు సభకు గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కళా బృందం ప్రచారం నిర్వహించారు. కళాజాత బృందం ప్రచారంలో ఎమ్మెల్యే విజయుడు, గురుకులాల మాజీ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాజాతా బృందంతో కలిసి ఎమ్మెల్యే విజయుడు, ఆర్‌ఎస్ ప్రవీకుమార్, భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, బీఆర్‌ఎస్ నాయకులు కిషోర్ డప్పులు వాయిస్తూ అందరిని ఉత్సాహపరిచారు. లక్ష డప్పులు వెయ్యి గొంతులకు విజయవంతం చేయాలని కోరారు.

పేదలకు నాణ్యమైన వైద్యం


కేంద్ర బృందం ప్రతినిధిని సన్మానిస్తున్న వైద్యసిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం: పేదలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్యం అందించేలా సిబ్బంది పనిచేయాలని కేంద్ర బృందం ప్రతినిధి డా. కవిత కోరారు. గురువారం మండలంలోని గగ్గలపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని కేంద్ర బృందం సందర్శించి సిబ్బందితో మాట్లాడి ఆరోగ్య సేవా పథకాలు ప్రజలకు చేరుతున్న విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర ఆరోగ్య పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. పేదలకు ప్రభుత్వ వైద్యం అందితేనే సమాజం అభివృద్ధి చెందినట్ల తెలిపారు. కార్యక్రమంలో బృందం సభ్యులు శక్తి మాళవిక, ప్రీతి, రేణయ్య, జ్యోతి పాల్గొన్నారు.

హెచ్‌సీఏ అండర్-14 జట్టుకు జిల్లా క్రీడాకారులు


పి.సాయిరాం


బి.సుప్రతిక్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా క్రికెట్ క్రీడాకారులు హెచ్‌సీఏ అండర్-14 బాలుర జట్టులో చోటు దక్కించుకున్నారు. పి.సాయిరాం మెయిన్ టీమ్‌లో, బి.సుప్రతిక్ స్టాండ్‌బైగా ఎంపికయ్యారు. విజయనగరంలో వచ్చేనెల 6వ తేదీ నుంచి అండర్-14 బాలుర క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది. పెవిలియన్ క్రికెట్ క్లబ్‌లో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు హైదరాబాద్‌లోని నటరాజ్ క్రికెట్ క్లబ్ తరపున ఈ సీజన్ లీగ్ మ్యాచుల్లో ప్రతిభ చాటి అండర్-14 జట్టుకు ఎంపికయ్యారు. సాయిరాం లీగ్ మ్యాచుల్లో 341 పరుగులు చేశాడు. అదే విధంగా అండర్-14 ప్రాబబుల్స్ మ్యాచుల్లో 93 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. సుప్రతిక్ 16 వికెట్లు తీసి సత్తా చాటాడు. అండర్-14 జట్టుకు వీరి ఎంపికపై పెవిలియన్ క్రికెట్ క్లబ్ కోచ్‌లు మహబూబ్‌పాష, భరత్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. అండర్-14 టోర్నీలో మెరుగైన ప్రతిభ కనబరిచి భవిష్యత్‌లో రంజీ, భారత జట్టుకు ఆడాలని ఆకాంక్షించారు.

నూతన ఏఈలకు సాంకేతిక శిక్షణ


కొత్త ఏఈలతో భూగర్భ కేంద్రం సీఈ, ఎస్‌ఈ, డీఈలు

దోమలపెంట: టీఎస్ జెన్‌కోలో ఎంపికైన అసిస్టెంట్ ఇంజినీర్ల(ఏఈ)కు ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లోని డీఈలు, ఏడీఈలు, సీనియర్ ఏఈలు ఇంజినీర్లకు గురువారం నుంచి శిక్షణ ఇస్తున్నట్లు ఎస్‌ఈ(ఓఅండ్‌ఎం) ఆదినారాయణ, ఎస్‌ఈ(సివిల్) రవీంద్రకుమార్ తెలిపారు. ఇరవై మూడు మందిని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ కేంద్రంకు జెన్‌కో యాజమాన్యం కేటాయించగా వారు ఇటీవలే విధుల్లో చేరారు. వీరిలో ఐదుమంది మహిళా ఇంజినీర్లు ఉన్నారన్నారు. వీరందరికీ చీఫ్ ఇంజినీర్ రామసుబ్బారెడ్డి ఆదేశాల మేరకు వారం రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. అంతకుముందు వీరిందరిని కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సీఈ, డీఈలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈలు శ్రీనివాసరెడ్డి, శ్రీకుమార్‌గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వర్గీకరణ సాధిద్దాం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ

జడ్చర్ల టౌన్: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే 'లక్షడప్పులు వేయిగొంతుకలు' మహాసభతో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వర్గీకరణను సాధిద్దామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంతీర్పును స్వాగతిస్తూ దేశంలో మొట్టమొదటగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేయటంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వర్గీకరణ చేసిన తొలిరాష్ట్రంగా నిలుస్తామని స్వయంగా రాష్ట్ర అసెంబ్లీలో పేర్కొన్న సీఎం నేటికీ పట్టించుకోవటం లేదన్నారు. రాష్ట్రంలో గతేడాది జరిగిన ఉపాధ్యాయ నియామకాల్లో మాదిగలకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం వర్గీకరణ రాష్ట్రాలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి, ఫిబ్రవరి 7న నిర్వహించే సభను జయప్రదం చేసేందుకు ఎస్సీలు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డప్పుకళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రొట్టెశేఖర్‌మాదిగ, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జంగయ్యమాదిగ, నాయకులు కొంగళి నాగరాజు, కరాటే శ్రీను, వినోద్‌లతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల కార్యవర్గాలను ఎన్నుకున్నారు.

బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాడుతాం


జనరల్ ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యయత్నానికి పాల్పడిన బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న నర్సింహాను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా బీరం మాట్లాడుతూ పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన అధికార పార్టీ నాయకుడు కోడేరు మండలం రాజాపూర్‌కు చెందిన నర్సింహా వద్ద డబ్బులు తీసుకుని ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని, సీఎం జిల్లాలోనే ఇలా జరగడం దారుణమన్నారు. అతడి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదుచేసినా ఎస్‌ఐ కేసు కూడా నమోదు చేయలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులు అభిలాష్‌రావు, రఘువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు




నిధులకోసం తవ్విన గుంత, పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించిన దృశ్యం


తాడూరు: మండల కేంద్రంలోని శివాలయం అనుసరించుకొని ఉన్న తిరుపతిరావు కూలిన ఇంట్లో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు చేశారు. తవ్వుతున్న సమయంలో శబ్దాలు రావడంతో చుట్టుపక్కల ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చేలోపే దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు తవ్విన ప్రదేశాన్ని పరిశీలించారు. దుండగులను గుర్తిస్తామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు


దర్గాలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

అచ్చంపేట: అచ్చంపేట మండలం రంగాపూర్‌లో వెలసిన నిరంజన్‌షావలి దర్గా వేడుకలు కొనసాగుతున్నాయి. గురువారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత సామరస్యానికి దర్పణం పట్టే అతిపెద్ద రెండో ఉర్సు నిరంజన్ షావలి దర్గాలో భక్తులు వలికి ఫాతేహాలు, కందూరులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన భక్తులు దర్గాను సందర్శించి ప్రార్థనలు చేశారు. ఉత్సవాలు ముగింపు దశకు చేరాయి. జిల్లా నలుమూలల నుంచేకాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై దర్గాలో మొక్కులు తీర్చుకున్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును ఒప్పుకోం



పెద్ద ధన్వాడలో ప్రారంభమైన రిలే నిరాహార దీక్ష

రాజోళి: పచ్చని పంట పొలాల్లో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును ప్రాణాలు పోయినా ఒప్పుకోమని ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు హెచ్చరించారు. మండలంలోని పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై గ్రామంతో పాటు పరిసర 10 గ్రామాల ప్రజలు తమ నిరసన గళాన్ని వినిపించారు. గురువారం ప్రారంభమైన దీక్షలో వారు మాట్లాడారు. ఊహ తెలిసినప్పటి నుంచి తమ గ్రామాల్లో పచ్చటి పంటలను మాత్రమే చూశామని.. ఇప్పుడు ఫ్యాక్టరీల ఏర్పాటు పేరుతో ఇతరులు గ్రామంలోకి వస్తే ఎలా ఒప్పుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ నెలకొల్పడంతో పంటలు, గాలి, నీరుకలుషితమవుతాయని తెలిసినా ప్రభుత్వాలు ఎలా అనుమతి ఇస్తున్నాయని ప్రశ్నించారు.

గట్టులో పట్టపగలే చోరీ

గట్టు : ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీ చేసినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. మూడున్నర తులాల బంగారం, రూ.30వేలు అపహరించారు. వివరాలు.. గట్టుకు చెందిన ఉలిగప్ప అనే వ్యక్తి గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి తల్లిని వ్యవసాయ పొలం దగ్గర వదిలాడు. కర్ణాటకలోని ఇడుపునూర్‌లో ఉన్న గొర్రెల వద్దకు బయలుదేరాడు. కొన్ని పరిస్థితులతో వెనుదిరిగి వచ్చాడు. ఇంటికి చేరుకొని తాళం వేసిన తలుపు తెరిచి ఉండడాన్ని గమనించాడు. అనుమానం వచ్చి పొలం దగ్గరఉన్న తల్లి పిలుచుకొని వచ్చి ఇంట్లోకి వెళ్లి పరిశీలించాడు. పెట్టెలోని మూడున్నర తులాల బంగారం, రూ.30వేల నగదు చోరీఅయినట్లు గమనించారు. ఉలిగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



● ఇంగ్లీష్ ఇడియమ్స్

లెట్ ది డస్ట్ సెటిల్

ఒక సంక్షోభం తరువాత లేదా గందరగోళం తరువాత వచ్చే సమయం కోసం ఎదురుచూసే సందర్భంలో వాడే మాట...లెట్ ది డస్ట్ సెటిల్.

ఉదా: ది కంపెనీ ఈజ్ ఫేసింగ్ క్రిటిసిజమ్ నౌ, బట్ దే ఆర్ వెయిటింగ్ టు లెట్ ది డస్ట్ సెటిల్ బిఫోర్ మేకింగ్ ఏ స్టేట్‌మెంట్

● మ్యూజిక్ వరల్డ్

మదిని దోచేలా మైమరచి పోయేలా!



అమెరికన్ సింగర్–సాంగ్ రైటర్ గ్రేసీ అబ్రామ్స్ రాసిన పాట 'దట్ ఈజ్ సో ట్రూ' బిల్‌బోర్డ్ జాబితాలో అగ్రస్థానంలో ఉంది. ఇది గ్రేసీ రెండవ ఆల్బమ్. అమెరికాకు వెలుపల ఆస్ట్రేలియా, బెల్జియం, న్యూజీలాండ్, నార్వే, యూనైటెడ్ కింగ్ డమ్, ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, నెదర్లాండ్స్, స్వీడన్, స్విట్జర్లాండ్‌లో మ్యూజిక్ చార్ట్‌లలో అగ్ర స్థానంలో నిలిచింది. 'ఐ కుడ్ గో అండ్ రీడ్ యువర్ మైండ్' అని హుషారెత్తిస్తోంది. ఆ సందడిలో మీరు భాగం కావాలంటే....'దట్ ఈజ్ సో ట్రూ' ఒక్కసారి వినేయండి. 'షీ ఈజ్ సో కూల్' అంటూ గ్రేసీతో గొంతు కలపండి.

● గేమింగ్

స్పైడర్–మ్యాన్ మరోసారి...

గ్రేట్ సూపర్ హీరోలా సాహసాలు ఎప్పుడూ సూపర్‌గానే ఉంటాయి. దీనికి ఉదాహరణ... స్పైడర్–మ్యాన్!

ఒక్క ముక్కలో చెప్పాలంటే స్పైడర్–మ్యాన్ గేమ్స్ ఎన్నో సాహసాలకు కేరాఫ్ అడ్రస్. 'మార్వెల్స్ స్పైడర్–మ్యాన్ 2' యాక్షన్ అడ్వెంచర్ గేమ్. మార్వెల్ కామిక్స్ క్యారెక్టర్ 'స్పైడర్–మ్యాన్' ఆధారంగా రూపొందించిన గేమ్ ఇది. థర్డ్ పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే ఈ గేమ్‌లో పీటర్ పార్కర్, మైకేల్ మోరేల్స్ ప్రధాన పాత్రలు. న్యూయార్క్ కేంద్రంగా సాగే ఈ ఆటలో ప్లేయర్స్ రకరకాల స్పైడర్–మ్యాన్ సూట్‌లను సేకరించవచ్చు.

సమస్త సాహసాలతో గేమింగ్ కమ్యూనిటీని ఆకట్టుకునే 'మార్వెల్స్ స్పైడర్–మ్యాన్' ఈ నెల చివర రానుంది.



సిరీస్: మార్వెల్స్ స్పైడర్–మ్యాన్
ప్లాట్‌ఫామ్స్: విండోస్
జానర్: యాక్షన్–అడ్వెంచర్
మోడ్: సింగిల్–ప్లేయర్



● రికార్డ్

ప్రయాణ ప్రేమికుడు, ప్రఖ్యాత పర్వతారోహకుడు సర్ మార్టిన్ కాన్వే 'అధిరోహించిన ప్రతి శిఖరం ఏదో ఒకటి నేర్పుతుంది' అంటారు. అలా చిన్న వయసులోనే ఎన్నో శిఖరాల ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకుంది విశాఖపట్నానికి చెందిన కామ్య కార్తికేయన్. పదహారేళ్లకే ఎవరెస్ట్ అధిరోహించి రికార్డ్ సృష్టించింది. తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ని అధిరోహించి సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసిన యంగెస్ట్ ఫిమేల్‌గా రికార్డు సృష్టించింది....

కామ్య... అఖండ ఖ్యాతి

ఇలా మొదలైంది...

కార్తికేయన్, లావణ్య దంపతులకు సాహస యాత్రలు ఇష్టం. తమ చిన్నారి కామ్యను భుజాలపై మోసుకుంటూనే ట్రెక్కింగ్‌కు వెళుతుండేవారు. అలా పర్వత శిఖరాలతో చిన్నవయసులోనే కామ్యకు పరిచయం అయింది. మూడేళ్ల వయసులోనే ముంబైలోని లోనావాలాలో తండ్రితో పాటు ట్రెక్కింగ్‌లో పాల్గొని 'శభాష్' అనిపించుకుంది. మహారాష్ట్రలోని ద్యూక్స్ నోస్, రాజ్‌గడ్ పర్వతాల్ని నాలుగేళ్ల వయసులో తల్లిదండ్రులతో పాటు అధిరోహించింది.

తల్లికి తగిన తనయ...

హిమాలయాల ట్రెక్కింగ్‌కు తల్లితో పాటు వెళ్లింది కామ్య. అప్పుడు ఆమె వయసు ఏడేళ్లు. తల్లీ కూతుళ్ల మొదటి ప్రయత్నంలోనే 12 వేల అడుగుల ఎత్తైన చంద్రశీల పర్వతారోహణ చేశారు. ఆ తర్వాత హిమాలయ పర్వత శ్రేణుల్లో ఒకటైన 13,500 అడుగుల ఎత్తైన హర్‌కిదమ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. అది పూర్తి చేసిన కొద్ది రోజుల్లోనే 13,500 అడుగుల ఎత్తైన కేదార్‌కంఠ పర్వతారోహణ చేశారు.

తొమ్మిదేళ్ల వయసులో హిమాలయాల్లో రూప్‌కుండ్ ట్రెక్కింగ్ చేసి రికార్డు సృష్టించింది కామ్య.

ప్రధాని మన్ కీ బాత్‌లో కామ్య...

'అవరోధాల్ని అధిగమించి మన ఖ్యాతిని ఖండాంతరాల్లో ఇనుమడింపజేయాలి అనుకునేవారికి విశాఖ నగరానికి చెందిన కామ్య కార్తికేయన్ అనే చిన్నారి స్ఫూర్తినిచ్చింది' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ కామ్యను ప్రశంసించారు. దక్షిణ అమెరికాలోని అత్యంత ఎత్తైన అకాన్కాగువా పర్వతాన్ని అధిరోహించిన సమయంలో మన్‌కీ బాత్‌లో కామ్య ప్రస్తావన తీసుకువచ్చారు మోదీ.

– కరుకోల గోపీకిశోర్‌రాజా, సాక్షి, విశాఖపట్నం

ఆల్ రౌండర్

ముంబై నేవీ స్కూల్‌లో ప్లస్‌టు చదువుతున్న కామ్య కార్తికేయన్ పర్వతారోహణలోనే కాదు చదువులోనూ ప్రతిభ కనబరుస్తోంది. ప్రతి పరీక్షలోనూ ఫస్ట్ గ్రేడ్ సాధిస్తోంది. సంగీతంలోనూ ప్రావీణ్యం పొందిన కామ్య పియానో వాయిద్యానికి సంబంధించి 3 గ్రేడులు పాసైంది. కర్ణాటక సంగీతం, భరతనాట్యంలోనూ 'ఆహా' అనిపించేలా ప్రతిభ చూపుతోంది.

ఏడు ఖండాల్లో ఎన్ని రికార్డ్‌లో!

● దక్షిణ అమెరికాలో 22,837 అడుగుల ఎత్తైన మౌంట్ అకాన్‌కాగువాని అధిరోహించి ఈ శిఖరాన్ని అధిరోహించిన తొలి బాలికగా ప్రపంచ రికార్డు సృష్టించింది ● ఆఫ్రికా ఖండంలో అత్యంత ఎత్తైన 18,652 అడుగుల మౌంట్ కిలిమంజారోపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించి ఈ శిఖర యాత్ర పూర్తి చేయించడం ద్వారా ఆసియాలోనే అతి పిన్న వయస్కురాలిగా రికార్డు ● యూరప్ ఖండంలోని అత్యంత ఎత్తైన 18,510 అడుగుల మౌంట్ ఎల్‌బ్రస్‌ని అధిరోహించి యంగెస్ట్ గర్ల్ ఇన్‌ది వరల్డ్‌గా రికార్డు ● ఆస్ట్రేలియా ఖండంలోని అతి ఎత్తైన మౌంట్ కాజియాస్కోని అధిరోహించిన రెండో బాలికగా రికార్డు ● ఉత్తర అమెరికాలోని 20,308 అడుగుల మౌంట్ డెనలీని అధిరోహించిన యంగెస్ట్ నాన్ అమెరికన్‌గా రికార్డు ● ఆసియా ఖండంలో అత్యంత ఎత్తైన 29,031 అడుగుల మౌంట్ ఎవరెస్ట్‌ని అధిరోహించి నేపాల్ వైపు నుంచి ఎవరెస్ట్‌ని అధిరోహించి ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా, తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ని అధిరోహించి, ప్రపంచంలోనే అతి పిన్నవయస్కురాలిగా రికార్డ్ సృష్టించింది.

ప్రతి అడుగూ సవాల్‌గా స్వీకరించాను

సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసి భారత త్రివర్ణపతాకాన్ని ఏడు ఖండాల్లోనూ రెపరెపలాడించాలన్నదే అమ్మా నాన్నల కల. వారి ఆకాంక్ష నెరవేర్చినందుకు గర్వంగా ఉంది. ఒకానొక సమయంలో మా పేరెంట్స్ తమ సంపాదనంతా నా మీదే ఖర్చు చేశారు. కొందరు దాతలు సహకారం అందించి నన్ను ముందుకు నడిపించారు. ఎంతటి కష్టాన్నైనా అవలీలగా ఎదుర్కోవాలన్నది నాన్న దగ్గర నేర్చుకున్నాను.

– కామ్య కార్తికేయన్

యువర్స్

● టెక్.. టాక్

ఇన్‌స్టాలో ఎడిట్ యాప్



స్మార్ట్‌ఫోన్‌లలో షార్ట్ వీడియో క్రియేషన్ సరికొత్త స్థాయికి చేరుకుంది. క్రియేటర్స్‌కు దగ్గరైన ప్లాట్‌ఫామ్‌లలో ఇన్‌స్టాగ్రామ్ ఒకటి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఐఫోన్‌ల కోసం 'ఎడిట్' యాప్‌ను ప్రకటించింది ఇన్‌స్టా.

'అధిక నాణ్యతతో వీడియోను రికార్డ్ చేయడానికి, మీరు కోరుకునే అన్ని ఎడిటింగ్ సాధనాలు, ఫ్రెండ్స్‌తో పాటు ఇతర క్రియేటర్‌లతో డ్రాఫ్టను షేర్ చేసే సామర్థ్యం ఎడిట్‌లో ఉంటాయి. ఎడిట్ అనేది క్రియేటివ్ టూల్స్ సమాహారం' అని ప్రకటించాడు ఇన్‌స్టాగ్రామ్ హెడ్ ఆడమ్ మొస్సేరి.

'ఎడిట్స్' యాప్‌ను ఉపయోగించడం వల్ల యూజర్‌లు వాటర్ మార్క్ లేకుండా వీడియోలను ఎక్స్‌పోర్ట్ చేయడానికి, వీడియోల పనితీరును విశ్లేషించడానికి...మొదలైన వాటికి ఉపయోగపడుతుంది. ఈ యాప్ 2కె రిజల్యూషన్ నుంచి 60 ఎఫ్‌పిఎస్ వరకు హెచ్‌డీఆర్, ఎస్‌డీఆర్ ఫార్మట్‌లో ఎడిటింగ్ వీడియోలను సపోర్ట్ చేస్తుంది.

ఇక మూడు నిమిషాలు!



యూట్యూబ్ షార్ట్స్ మాదిరిగానే మూడు నిమిషాల నిడివి గల వీడియోలను ప్లాట్‌ఫామ్‌లో అప్లోడ్ చేయవచ్చని తెలియజేసింది ఇన్‌స్టాగ్రామ్. గతంలో 90 సెకన్‌ల వరకు వీడియోలను అప్లోడ్ చేసే అవకాశం కల్పించింది ఇన్‌స్టాగ్రామ్.

'ఇక నుంచి మీరు మూడు నిమిషాల నిడివి గల రీల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌లో లాంగ్–ఫామ్ వీడియోలపై కాకుండా షార్ట్–ఫామ్ వీడియోలపై దృష్టి పెట్టాలనుకున్నాం. కానీ 90 సెకనులు చాలా తక్కువ సమయం అని క్రియేటర్‌ల నుంచి ఫీడ్‌బ్యాక్ వచ్చింది. పెంచిన సమయం వల్ల మీరు మరిన్ని స్టోరీలను షేర్ చేయవచ్చు' అని ఇన్‌స్టాగ్రామ్ ప్రకటించింది.



ఏసర్ స్విఫ్ట్ జో 14

స్క్రీన్ సైజ్: 14 అంగుళాలు
స్క్రీన్ రిజల్యూషన్: 2880×1800 పిక్సెల్స్
డైమెన్షన్స్: 312.9×217.9×14.9 ఎంఎం
బరువు: 1.25 కేజీ

ఓపెన్ ఏఐ టాస్క్స్



'టాస్క్స్' అనే న్యూ చాట్‌జీపీటి కేపబిలిటీతో ముందుకురానుంది ఓపెన్ ఏఐ. ప్రస్తుతం ఇది బీటా దశలో ఉంది. అలారం సెట్ చేయడం, ప్రజెంటేషన్ ఇవ్వడానికి అవసరమైన రాబోయే సమావేశాన్ని గుర్తు చేయడంలాంటి పనులను చేయగలదు. నీరు తాగడం నుంచి గ్రాసరీ షాపింగ్ వరకు ఎన్నో విషయాలలో 'టాస్క్స్' ద్వారా రిమైండర్స్ సెట్ చేసుకోవచ్చు.

సాక్షి సినిమా

హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్

– వెంకటేశ్



● భీమ్స్, వెంకటేశ్, అనిల్ రావిపూడి

''సంక్రాంతి పండగకి నిజాయతీగా ఓ ఫ్యామిలీ సినిమా ఇవ్వాలనుకున్నాం. ప్రేక్షకులు మా ప్రయత్నాన్ని ఆదరించారు. హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్ అంటున్నారు. మా సినిమాకి ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని హీరో వెంకటేశ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలైంది. గురువారం చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ– ''అనిల్‌తో నేనో ఫ్రెండ్‌లానే ఉంటాను. మేము చాలా ఎంజాయ్ చేస్తూ వర్క్ చేస్తాం.. అందుకే రిజల్ట్ ఇంత పాజిటివ్‌గా ఉంటుంది. ఇక నా సినిమా ఇన్ని కోట్లు వసూలు చేయాలని నేనెప్పుడూ అడగను... వచ్చింది తీసుకోవాలి. ఇప్పటికే మా సినిమా రూ. 230 కోట్లు వసూలు చేయడం అనేది బోనస్.. ఇంతకంటే ఏం కావాలి'' అన్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ–''సినిమాకి కాస్త దూరమైన ప్రేక్షకులు కూడా మా 'సంక్రాంతికి వస్తున్నాం' కోసం థియేటర్‌కి రావడం ఆనందంగా ఉంది. రెవెన్యూ సైడ్ కూడా మేం ఊహించినదానికంటే అద్భుతంగా రావడం హ్యాపీ'' అని చెప్పారు. ''వెంకటేశ్‌గారి 'కలిసుందాం రా' సినిమా పాటలని ప్రేక్షకులు ఎంత గుండెల్లో పెట్టుకున్నారో... 'సంక్రాంతికి వస్తున్నాం' సాంగ్స్‌ని కూడా అదే స్థాయిలో ఆస్వాదించడం సంతోషంగా ఉంది'' అని సంగీత దర్శకుడు భీమ్స్ అన్నారు.

లైలాగా రెడీ కావడానికి రెండు గంటలు పట్టేది

– విశ్వక్ సేన్



● సాహు గారపాటి, విశ్వక్ సేన్, రామ్ నారాయణ్

''నా కెరీర్‌లో యాక్షన్ టచ్‌తో రూపొందిన ఔట్ అండ్ ఔట్ కామెడీ ఫ్యామిలీ ఫిల్మ్ 'లైలా'. చాలా క్లీన్‌గా ఉంటుంది. ప్రేక్షకులంతా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా కోసం లైలాగా రెడీ కావడానికి రెండు గంటలు పట్టేది. నిజంగా అమ్మాయిలకు హ్యాట్సాఫ్ చెప్పాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో విశ్వక్ సేన్, ఆకాంక్షా శర్మ జంటగా నటించిన చిత్రం 'లైలా'. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. లియోన్ జేమ్స్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఇచ్చుకుందాం బేబీ...' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. పూర్ణాచారి సాహిత్యం అందించిన ఈ పాటని ఆదిత్య ఆర్కే, ఎంఎం మానసి ఆలపించారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''లైలా'లో మోడల్ సోనూ, లైలా అనే రెండు పాత్రల్లో నటించా'' అన్నారు. ''లైలా' కథ ఇద్దరు ముగ్గురు హీరోలకు చెప్పాను. లేడీ గెటప్ వేయడం అంత ఈజీ కాదు. సినిమా అంటే పిచ్చి ఉంటేనే చేయగలరు. అలాంటి పిచ్చి ఉన్న విశ్వక్ దొరికారు'' అని రామ్ నారాయణ్ చెప్పారు. ''ఈ పాత్ర విశ్వక్ కెరీర్‌లో నిలిచిపోతుంది'' అన్నారు సాహు గారపాటి. పాటల రచయిత పూర్ణాచారి మాట్లాడారు.



● సాయిపల్లవి, నాగచైతన్య

హైలెస్సో హైలెస్సా

'హైలెస్సో హైలెస్సా...' అంటూ ఆడి పాడేస్తున్నారు నాగచైతన్య, సాయిపల్లవి. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య, సాయి పల్లవి జోడీగా నటించిన చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 7న విడుదల కానుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'హైలెస్సో హైలెస్సా... నీవైపే తెరచాపని తిప్పేసా...' అంటూ సాగే మూడో పాటని గురువారం రిలీజ్ చేశారు. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటని శ్రేయా ఘోషల్, నకాష్ అజీజ్ పాడారు. ''మోస్ట్ ఎవైటెడ్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'తండేల్'. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 'బుజ్జి తల్లి..', 'నమో నమః శివాయ...' పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. వండర్‌ఫుల్ మెలోడీస్‌ని కంపోజ్ చేయడంలో మాస్టర్ అయిన దేవిశ్రీ ప్రసాద్ తాజాగా 'హైలెస్సో హైలెస్సా..' అంటూ సాగే మరొక లవ్ మెలోడీని కంపోజ్ చేశారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఉత్తమ చిత్రం: అనోరా, ది బ్రూటలిస్ట్, ఎ కంప్లీట్ అన్‌నోన్, కాన్‌క్లేవ్, డ్యూన్: పార్ట్ 2, ఎమిలియా పెరెజ్, ఐయామ్ స్టిల్ హియర్, నికెల్ బాయ్స్, ది సబ్‌స్టాన్స్, విక్డ్ ● **ఉత్తమ దర్శకుడు:** సీన్ బేకర్ (అనోరా), బ్రాడీ కార్బెట్ (ది బ్రూటలిస్ట్), జేమ్స్ మ్యాన్‌గోల్డ్ (ది కంప్లీట్ అన్‌నోన్), జాక్వెస్ ఆడియార్డ్ (ఎమిలియా పెరెజ్), కోరలీ ఫార్గేట్ (ది సబ్‌స్టాన్స్) ● **ఉత్తమ నటుడు:** అడ్రియాన్ బ్రాడీ (ది బ్రూటలిస్ట్), తిమోతీ చాలమెట్ (ది కంప్లీట్ అన్‌నోన్), కోల్‌మెన్ డొమినింగో (సింగ్‌సింగ్), రేఫియన్నెస్ (కాన్‌క్లేవ్), సెబస్టియన్ స్టాన్ (ది అప్రెంటిస్) ● **ఉత్తమ నటి:** సింథియా ఎరివో (విక్డ్), కార్లా సోఫియా గాస్కన్ (ఎమిలియా పెరెజ్), మికే మాడిసన్ (అనోరా), డెమి మూర్ (ది సబ్‌స్టాన్స్), ఫెర్నాండా టోర్రెస్ (ఐ యామ్ స్టిల్ హియర్) ● **ఉత్తమ సహాయ నటుడు:** యురా బోరిసోవ్ (అనోరా), కిరెన్ కల్కిన్ (ది రియల్ పెయిన్), ఎడ్వర్డ్ నార్టన్ (ది కంప్లీట్ అన్‌నోన్), గాయ్ పియర్స్ (ది బ్రూటలిస్ట్), జెరేమీ స్ట్రాంగ్ (ది అప్రెంటిస్) ● **ఉత్తమ సహాయ నటి:** మోనికా బార్బరో (ది కంప్లీట్ అన్‌నోన్), అరియానా గ్రాండే (విక్డ్), ఫెలిసిటీ జోన్స్ (ది బ్రూటలిస్ట్), ఇసబెల్లా రోస్సెల్లిని (కాన్‌క్లేవ్), జోయా సాల్డానా (ఎమిలియా పెరెజ్).




● కార్లా సోఫియా గ్లాస్కాన్

97వ ఆస్కార్ అవార్డ్ నామినేషన్స్ ప్రకటన

ఆస్కార్ సంబరం ఆరంభం





● 13 నామినేషన్లతో నాన్ ఇంగ్లీష్ మూవీ 'ఎమిలియా పెరెజ్' రికార్డ్
● 'ది బ్రూటలిస్ట్, విక్డ్' చిత్రాలకు 10 నామినేషన్స్
● ట్రాన్స్‌జెండర్‌కి దక్కిన తొలి నామినేషన్ ● ఇండియన్ షార్ట్ ఫిల్మ్‌కి నామినేషన్


97వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం ఈ ఏడాది మార్చి 2న లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఘనంగా జరగనుంది. కాగా ఈ అవార్డులకు సంబంధించిన నామినేషన్లను గురువారం రాత్రి (భారతీయ కాలమానం ప్రకారం) ప్రకటించారు. అమెరికన్ నటుడు బోవెన్ యాంగ్, నటి రాచెల్ సెన్నాట్‌లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. అయితే ఈ నామినేషన్ల ప్రకటన ఈ నెల 17న జరగాల్సింది. కానీ అమెరికాలో చెలరేగిన కార్చిచ్చు కారణంగా 19కి వాయిదా వేశారు. ఫైనల్‌గా 23న ప్రకటించారు.

రికార్డ్ సాధించిన స్పానిష్ మ్యూజికల్ థ్రిల్లర్

ఈసారి స్పానిష్ మ్యూజికల్ థ్రిల్లర్ మూవీ 'ఎమిలియా పెరెజ్' నాన్–ఇంగ్లీష్ విభాగంలో 13 నామినేషన్లు దక్కించుకుని రికార్డ్ సాధించింది. గతంలో చైనా మూవీ 'క్రౌచింగ్ టైగర్ హిడెన్ డ్రాగన్', మెక్సికన్–అమెరికన్ డ్రామా 'రోమా'... ఈ రెండు చిత్రాలు నాన్–ఇంగ్లీష్ విభాగంలో పది నామినేషన్లు దక్కించుకున్నాయి. ఇప్పుడు 13 నామినేషన్లతో 'ఎమిలియా పెరెజ్' వాటిని అధిగమించింది. అలాగే ఈ చిత్రంలో ఓ లీడ్ రోల్‌లో నటించిన స్పానిష్ నటి కార్లా సోఫియా గాస్కాన్ (బెస్ట్ యాక్ట్రస్ లీడ్ రోల్ నామినేషన్) చరిత్ర సృష్టించారు. ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయిన తొలి ట్రాన్స్‌జెండర్ నటిగా నిలిచారామె. ఇంకా 'ది బ్రూటలిస్ట్, విక్డ్' చిత్రాలకు పది నామినేషన్ల చొప్పున దక్కాయి.

అంతగా అంచనాలు లేని 'కాన్‌క్లేవ్' మూవీకి 8 నామినేషన్లు దక్కడం ఓ విశేషం.

ఒక్క నామినేషన్ తేడాతో... నాన్ ఇంగ్లీష్ ఫిల్మ్ విభాగంలో 13 నామినేషన్లు దక్కించుకుని, రికార్డు సాధించిన 'ఎమిలియా పెరెజా'కి ఇంకో నామినేషన్ దక్కి ఉంటే... ఇంగ్లీష్ ఫిల్మ్‌ల రికార్డుని కూడా అధిగమించి ఉండేది. 'టైటానిక్, ఆల్ అబౌట్ ఈవ్, లా లా ల్యాండ్' వంటి ఇంగ్లీష్ చిత్రాలు 14 నామినేషన్లు దక్కించుకున్నాయి.



తల్లి హిస్టరీ రిపీట్: 'ఐయామ్ స్టిల్ హియర్' చిత్రానికి గాను ఫెర్నాండా టోర్రెస్ ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్నారు. ఇందులో విశేషం ఏంటంటే... ఆమె తల్లి ఫెర్నాండా మోంటెనెగ్రో 1991లో 'సెంట్రల్ స్టేషన్' చిత్రానికి గాను ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్న తొలి బ్రెజిలియన్ నటిగా రికార్డుని సాధించారు. ఇప్పుడు ఇన్నేళ్లకు మలి బ్రెజిలియన్ నటిగా టోర్రెస్ నామినేషన్ దక్కించుకుని తల్లి హిస్టరీని రిపీట్ చేశారు.

బరిలో ఇండియన్ షార్ట్ ఫిల్మ్: ఆడమ్ జే గ్రేవ్స్ దర్శకత్వం వహించిన 'అనూజ' బెస్ట్ షార్ట్ ఫిల్మ్ (లైవ్ యాక్షన్) విభాగంలో నామినేషన్ దక్కించుకుంది. ఆల్రెడీ రెండు ఆస్కార్ అవార్డులు సాధించిన భారతీయ నిర్మాత గునీత్ మోంగా ఈ చిత్రానికి ఓ నిర్మాత కావడం విశేషం. అలాగే నటి ప్రియాంకా చోప్రా ఓ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఢిల్లీలోని ఓ గార్మెంట్ ఫ్యాక్టరీలో పని చేసే తొమ్మిదేళ్ల అనూజ స్కూల్‌కు వెళ్లాలనుకుంటుంది. ఆ నిర్ణయం ఆమె జీవితాన్ని, అనూజ సోదరి పాలక్ భవిష్యత్‌ను ఏ విధంగా ప్రభావితం చేసింది? అనే కోణంలో ఈ చిత్రం సాగుతుంది. అనూజగా సజ్దా పఠాన్, పాలక్‌గా అనన్య షాన్‌భాగ్ నటించారు. ఇదిలా ఉంటే... గునీత్ మోంగా ఓ నిర్మాతగా వ్యవహరించిన 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కి గాను బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో 2023లో ఆస్కార్ దక్కింది. అంతకుముందు 2021లో గునీత్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన 'పీరియడ్: ఎండ్ ఆఫ్ సెంటెన్స్'కిగాను బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో అవార్డు దక్కింది. ఇప్పుడు ఆమె ఓ నిర్మాతగా వ్యవహరించిన 'అనూజ'కు కూడా ఆస్కార్ దక్కుతుందా? అనేది చూడాలి.

భారతీయ సినిమాకి నిరాశ

ఆస్కార్ అవార్డ్స్ రిమైండర్ లిస్ట్‌లో నిలిచిన భారతీయ చిత్రాలు 'కంగువ, ఆడు జీవితం ('ది గోట్ లైఫ్), సంతోష్, స్వతంత్రవీర్ సావార్కర్, ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్, గర్ల్స్ విల్ బీ గర్ల్స్, పుతల్' ఆస్కార్ నామినేషన్‌ను దక్కించుకోలేకపోయాయి. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో నామినేషన్ కోసం ఈ ఏడాది ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పంపిన హిందీ చిత్రం 'లాపతా లేడీస్' ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లోనూ చోటు దక్కించుకోలేకపోయిన విషయం తెలిసిందే. ఇలా ఈసారి భారతీయ సినిమాకి నిరాశ ఎదురైంది.